# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-09-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రతి ఇంటికి సహాయం అందించేలా చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు .**

2. **వరద బాధితులకు ఆహార పంపిణీ సక్రమంగా అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ వెల్లడించారు.**

3. **బుడమేరు వరద ఉధృతి వల్ల పడిన గండ్లను పూడ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు**

4. **దక్షిణ మధ్య రైల్వే పరిధిలో విజయవాడ మీదుగా నడిచే పలు రైళ్లను రద్దు చేసినట్లు అధికారులు వెల్లడించారు.**

5. **ఈ రోజు జాతీయ వన్యప్రాణుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.**

==========================

వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రతి ఇంటికి సహాయం అందించేలా చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో వరద సహాయక చర్యలపై మంత్రులు, కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి ఈ రోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముంపు ప్రాంతాల్లో విస్తృతంగా చర్యలు చేపట్టి సాధారణ స్థితికి తీసుకొస్తున్నామని చెప్పారు. ప్రతి ఇంటికి సహాయం అందించాలని, వరదల్లో మృతి చెందిన వారిని గుర్తించి వారి కుటుంబాలకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరద తగ్గుతున్నందున పారిశుద్ధ్య పనులను చేపట్టేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

---------------------------

వరద బాధితులకు ఆహార పంపిణీ సక్రమంగా అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ మైదానంలో ఏర్పాటు చేసిన ఆహార వితరణ కేంద్రాన్ని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ తో కలిసి మంత్రి ఈ రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముంపు ప్రాంతాల్లోని వరద బాదితులందరికి ఆహారాన్ని అందించేందుకు ఒక వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. ఈరోజు 4 లక్షల 50 వేలకు పైగా అల్పాహార పొట్లాలు, లక్ష 50 వేల లీటర్ల కు పైగా పాలను పంపిణీ చేశామని తెలిపారు. వరద తగ్గేంతవరకు సహాయక చర్యలను కొనసాగిస్తామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

---------------------------

ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండల పరిధిలోని కవులూరు గ్రామ శివారులో పోలవరం కుడికాల్వకు బుడమేరు వరద ఉధృతి వల్ల పడిన గండ్లను త్వరితగతిన పూడ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పోలవరం కుడికాల్వకు గండ్లు పడిన ప్రదేశాన్ని నిన్న ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పోలవరం కుడి కాల్వకు ఎడమ వైపు మూడు చోట్ల, కుడి వైపు ఏడు చోట్ల గండ్లు పడ్డాయని తెలిపారు. మరల నీటి ప్రవాహం పెరిగితే వరద ప్రవాహం మొత్తం విజయవాడ వైపు వచ్చే అవకాశం ఉన్నందున వెంటనే గండ్లు పూడ్చి కట్టను బలోపేతం చేసేందుకు చర్యలు చేపడతామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని పలు ప్రాంతాలు నీట మునిగిన నేపథ్యంలో విజయవాడ డివిజన్ మీదుగా నడిచే రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ రోజు నడిచే తాంబరం–సంత్రగచ్చి, న్యూ ఢిల్లీ–విశాఖపట్నం, షిర్డీసాయినగర్– మచిలీపట్నం , హైదరాబాద్–షాలీమార్, నాగర్ సోల్–నర్సాపూర్ రైళ్లు, రేపు నడిచే హైదరాబాద్–షాలీమార్, నాగర్ సోల్–నర్సాపూర్ రైళ్లను రద్దు చేసినట్లు వెల్లడించారు. ఈ నెల 6న నడిచే కొచ్చువెల్లి–షాలీమార్, ఈ నెల 7న నడిచే కన్యాకుమారి–హౌరా తిరుసువెల్లి–పురులియ రైళ్లను పూర్తిగా రద్దు చేసినట్లు తెలిపారు.

---------------------------

అంతరించిపోతున్న వన్యప్రాణులను, పశుపక్ష్యాదులను పెంపొందించి.. వాటి పరిరక్షణపట్ల అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఈ రోజు జాతీయ వన్యప్రాణుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. వన్యప్రాణులను కాపాడే విషయంలో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు ఈ కార్యక్రమం జరుగుతోంది. వన్యప్రాణుల ఎదుగుదలకు తగిన వాతావరణం కల్పించే విషయంలో కృషి చేసేలా ప్రజలను ప్రోత్సహించడానికి సెప్టెంబర్ 4వ తేదీని జాతీయ వన్య ప్రాణుల పరిరక్షణ దినంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

---------------------------

విజయవాడలోని ప్రకాశం బ్యారేజీకి వరద ప్రవాహం క్రమంగా తగ్గుతోంది. పులిచింతల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 2.36 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. అక్కడ వరద తగ్గడంతో ప్రకాశం బ్యారేజీపై ఒత్తిడి తగ్గింది. వరద ఉధృతి 11.43 లక్షల నుంచి 4.81 లక్షల క్యూసెక్కులకు చేరింది. బ్యారేజీ నుంచి కాల్వలకు 500 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. మరోవైపు గేట్లకు అడ్డుగా ఉన్న పడవలను తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రకాశం బ్యారేజీ వద్ద ప్రస్తుతం మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది.

---------------------------

వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బి.శ్రీనివాస్ కోరారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం నుంచి విజయవాడ వరద ప్రాంతాలకు ఈ రోజు 25 వేల ఆహార పొట్లాలను వాహనంలో తరలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే దాదాపు 40 వేల ప్యాకెట్ల ఆహారాన్ని విజయవాడకు పంపించామన్నారు. వరద ప్రభావం తగ్గే వరకు తాడేపల్లిగూడెం నుంచి ప్రతిరోజు 20 వేల ప్యాకెట్ల ఆహారాన్ని అందించడానికి ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు.

---------------------------

విజయవాడ నగరంలో ఈ రోజు మోస్తరు వర్షం కురుస్తోంది. దీంతో వరద ముంపులో ఉన్న పలు ప్రాంతాల్లో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. నగరంలోని వరద బాధితులు నాలుగో రోజు కూడా ముంపులోనే ఉన్నారు. పలుచోట్ల ప్రవాహం తగ్గినా దిగువ ప్రాంతాలకు నీటిమట్టం తగ్గలేదు. ఇప్పటికే వేలమంది బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. వేర్వేరు ప్రాంతాల్లో నిన్న పలు మృతదేహాలు లభ్యమయ్యాయని అధికారులు తెలిపారు. మరోవైపు బుడమేరుకు గండి పడడంతో దేవీనగర్ బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. బుడమేరు కాల్వ గట్లపై ఉన్న ఇళ్లలోకి వరద వచ్చే అవకాశం ఉందని నిడమానూరు, ఎనికెపాడు, ప్రసాదంపాడు కాల్వగట్ల ప్రాంతాల వాసులు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్....18 సెకన్లు...

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా 67 వేల మంది వరద బాధిత కుటుంబాలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్నామని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా కొల్లిపర మండలం అత్తలూరివారిపాలెం, మున్నంగి, పిడపర్తిపాలెం, బొమ్మువానిపాలెం ప్రాంతాల్లో నిన్న ఆయన పర్యటించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. వరద బాధిత గ్రామాల్లోని ప్రతి కుటుంబానికి 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, పంచదార, లీటరు వంట నూనె అందిస్తున్నామని పేర్కొన్నారు. మార్కెటింగ్ శాఖ ద్వారా బాధిత కుటుంబాలకు ఉల్లిపాయలు, బంగాళదుంపలు అందిస్తున్నామన్నారు. పశుగ్రాసం, పశు సంరక్షణ చర్యలకు సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చామని మంత్రి వివరించారు.

---------------------------

నీట మునిగిన పంటలను పూర్తిస్థాయి నష్టంగా పరిగణనలోకి తీసుకుంటామని వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం పెదకొండూరులో నిన్న ఆయన ఆ శాఖ కమిషనర్ ఢిల్లీరావుతో కలిసి ముంపునకు గురైన పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులంతా పంటల వివరాలు నమోదు చేయించుకోవాలని, వాటి ఆధారంగ పరిహారం అందిస్తామనిచెప్పారు. మండలంలో మొత్తం 350 ఎకరాలు నీట మునిగాయని వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారని తెలిపారు.

---------------------------

భారత ప్రభుత్వం అందించే 'శిల్పగురు' పురస్కారానికి శ్రీసత్యసాయి జిల్లా, ధర్మవరం మండలం నిమ్మలకుంట గ్రామానికి చెందిన తోలుబొమ్మల కళాకారిణి డి. శివమ్మ ఎంపిక అయ్యారు. కేంద్ర జౌళి శాఖ నిర్వహించే శిల్పగురు, జాతీయ చేతి వృత్తుల అవార్డు-2023 పోటీలకు తోలుపై రూపొందించిన శ్రీకృష్ణ చరిత, ఏడు అడుగుల ఎత్తైన విశ్వరూప హనుమాన్ కళాఖండాలను పంపించగా కేంద్ర ప్రభుత్వం.. శిల్పగురు పురస్కారానికి ఎంపిక చేసిందని, అధికారులు తెలిపారు. .ఈ సందర్బంగా శివమ్మ మాట్లాడుతూ.. శిల్పగురు అవార్డుకు ఎంపిక కావడం తోలుబొమ్మల కళాకారులకు దక్కిన గౌరవమని చెప్పారు.

---------------------------

ప్రయాణికుల సౌకర్యార్థం పలు ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తెచ్చినట్లు వాల్తేరు రైల్వే. డివిజినల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. అక్టోబరు 6 నుంచి జనవరి 1వ తేదీ వరకు ప్రతి ఆదివారం తిరుపతి–శ్రీకాకుళంరోడ్ ప్రత్యేక రైలు, అక్టోబరు 7 నుంచి జనవరి 2వ తేదీ వరకు ప్రతి సోమవారం శ్రీకాకుళంరోడ్–తిరుపతి ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు తెలిపారు.

---------------------------

ప్రముఖ విద్యావేత్త, సామాజిక నాయకులు దాదాభాయ్ నౌరోజి జయంతి ఈరోజు. గుజరాత్‌లోని నవసరి నగరంలో 1825 సెప్టెంబర్ 4వ తేదీన జన్మించిన ఆయన... 'గ్రాండ్ ఓల్మన్ ఆఫ్ ఇండియా'గా సుప్రసిద్ధులయ్యారు. భారత జాతీయ కాంగ్రెస్ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరయిన ఆయన... 1892 నుండి 1895 వరకు ఇంగ్లండ్ చట్ట సభ–యునైటెడ్ కింగ్ డమ్ హౌస్ ఆఫ్ కామన్స్‌లో సభ్యునిగా కొనసాగారు. ఈ పదవి పొందిన మొదటి ఆసియా వ్యక్తి అయిన దాదాభాయ్ నౌరోజి... 1917 జూన్ 30న తుదిశ్వాస విడిచారు.

---------------------------

======================